బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 01 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు భూసేకరణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు నిమిత్తం భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈక్రమంలోనే దుద్యాల మండలంలోని లగచర్లలో 110 ఎకరాల 32 గుంటలు, పోలేపల్లిలో 71 ఎకరాల 39 గుంటల భూసేకరణ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసింది. లగచర్లలో రైతులు, స్థానికుల ఆందోళనల నేపథ్యంలో అంతకుముందు ఇక్కడ ఫార్మా విలేజ్ కోసం ఇచ్చిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఇటీవల ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. గతంలో దుద్యాల మండలం హకీంపేట, లగచర్ల, పోలెపల్లి గ్రామాల్లో ఫార్మావిలేజ్ కోసం 1,538 ఎకరాల భూసేకరణ కోసం నోటిపిషన్ జారీ చేసిన సర్కారు ఉద్రిక్తతల నేపథ్యంలో వెనక్కి తగ్గింది.ఫార్మా విలేజ్‌కు బదులుగా తాజాగా మల్టీపర్పస్ ఇండస్ట్రీయల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం భూములు సేకరించనుంది. కాలుష్యకారక ఫార్మా కంపెనీల కోసం భూములు ఇవ్వబోమని ఆయా గ్రామాల రైతులు విముఖత వ్యక్తం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. కాలుష్యం లేని, పర్యావరణ హిత పరిశ్రమల ఏర్పాటుకే పారిశ్రామిక వాడ ఏర్పాటులో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది.

మాయమాటలు నమ్మి అభివృద్ధిని అడ్డుకోవద్దు

- లక్ష కోట్లతో పాలమూరు రాత మారుస్తాం
- పరిశ్రమ కోసం 1,300 ఎకరాలు సేకరించవద్దా?
- రైతుల కోసం రూ. 54 వేల కోట్ల ఖర్చు చేశాం
- లగచర్ల రైతులకు కావాలంటే ఎకరానికి రూ.20లక్షలు కూడా ఇస్తాం
- కంపెనీలు వస్తే ఉపాధి వస్తుంది
- సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, మహబూబ్‌నగర్ బ్యూరో

మాయమాటలు నమ్మి భూసేకరణను అడ్డుకోవద్దని, ఎవరెన్ని కుట్రలు చేసినా.. కొడంగల్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తామని.. 25 వేల మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు బిడ్డ సీఎంగా ఉండీ.. ఈ జిల్లాను అభివృద్ధి చేయకపోతే చరిత్ర తనను క్షమించదని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో.. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పాలన విజయోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రైతు పండుగ ముగింపు సభలో శనివారం సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. లగచర్లలో ఫార్మా సిటీ కోసం భూసేకరణ అంశంలో స్థానిక రైతులను బీఆర్ఎస్ నేతలు రెచ్చగొట్టారని.. వాళ్ల మాటలు నమ్మిన అమాయకులు అధికారులపైన దాడులు చేసి.. ఇప్పుడు కేసుల్లో ఇరుక్కున్నారని ఆరోపించారు. అయితే.. లగచర్లతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేస్తామని.. అందుకోసం భూసేకరణ చేసి తీరుతామని స్పష్టం చేశారు. 1300 ఎకరాల భూమి తీసుకుంటే అది తన కోసమా.. అంటూ ప్రశ్నించారు. తన సొంత నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపించి అభివృద్ధి చేయాలనేదే తన తపన అని అన్నారు. రాష్ట్రంలో గతంలో ఎవరూ భూ సేకరణ చేయలేదా.. ప్రాజెక్టులు కట్టలేదా.. అంటూ ప్రశ్నించారు. గతంలో కూడా అధికారులపై ఇలాగే దాడులు చేసి ఉంటే ప్రాజెక్టులు వచ్చేవా అని నిలదీశారు. అభివృద్ధి జరగాలంటే ఎవరో ఒకరు నష్టపోవాల్సిందేనని.. అభివృద్ధి జరగాలంటే భూ సేకరణ జరగాల న్నారు. కానీ బీఆర్ఎస్ నేతల మాటలు విని అమాయకులైన యువత, రైతులు పరిశ్రమలను అడ్డుకుంటున్నారన్నారు. అభివృద్ధిని అడ్డుకోకుండా సహకరించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి, పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే లక్ష కోట్లు ఖర్చు చేస్తే, ఆ ప్రాజెక్టు కుప్పకూలిపోయిందని విమర్శించారు. మహబూబ్‌నగర్ ప్రాజెక్టులకు నిధులు ఇచ్చేందుకు కేసీఆర్‌కు మనసొప్పలేదని మండిపడ్డారు. ఎవరెవరో వచ్చి మన జిల్లాను దత్తత తీసుకుంటామని అన్నారని వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు.

భూసేకరణలో భూమి కోల్పోయిన వారికి ఒక్కో ఎకరాకు 10 లక్షలు కాకపోతే 20 లక్షలు ఇస్తానని ప్రకటించారు. భూములు ఇచ్చేవారికి న్యాయం చేసేలా నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంటామని, అన్ని రకాల చర్యలు తీసుకుంటానని రేవంత్ రెడ్డి తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా.. కొడంగల్‌లో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తామని.. 25 వేల మంది స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని.. ఇది తన బాధ్యత అన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాటలు విని లగచర్ల ప్రజలు కేసుల్లో ఇరుక్కోవద్దని హెచ్చరించారు. పాలమూరు ప్రాంత బిడ్డగా సీఎం పదవి ఉండి కూడా సొంత జిల్లాకు నిధులు కేటాయించక, నీళ్లు ఇవ్వక, అభివృద్ధి చేయకపోతే చరిత్ర నన్ను క్షమిస్తుందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు జిల్లాలో 20 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించే బాధ్యత తనదేని తెలిపారు. ఇంటికో ఉద్యోగం వస్తే ఆ కుటుంబం తలరాత మారుతుందని అన్నారు. పాలమూరు ప్రజలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తాం అని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి ఈ జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

తన దగ్గరికి చాలా చీటీలు వచ్చాయని.. కానీ ఒక్కొక్కటిగా కాకుండా.. 70 ఏళ్లుగా అణచివేతకు గురవుతున్న పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం.. సంవత్సరానికి రూ.20 వేల కోట్లు కేటాయి స్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తామని తెలిపారు. పాలమూరు జిల్లా నుంచి ఏవైనా ఫైళ్లు వస్తే.. కొంచెం చూసి సంతకం పెట్టాలంటూ డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్ హయాంలో కట్టిన మంజీర, కోయిలసాగర్, శ్రీరాంసాగర్, ఎల్లంపల్లిలాంటి ప్రాజెక్టుల ద్వారా 1కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండించామని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఈ స్థాయిలో ఎవరూ పండించలేదని చెప్పారు. ఏడాది లోపే 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని తెలిపారు. రైతులకు ఉచిత కరెంటు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

నవంబర్ 30కి దేశవ్యాప్తంగా ప్రాధాన్యత ఉందని చెప్పారు. దొరల గడీలను కూల్చివేసి రాష్ట్రంలో మార్పు రావాలని 2023 నవంబర్ 30న ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. ఈ సందర్భంగా రైతుపండగకు ఏర్పాట్లు చేసిన అధికారులకు అభినందనలు తెలియజేశారు. తాను వనపర్తిలో చదువుతున్నప్పుడు ఏదో ఒకరోజు పాలమూరు బిడ్డకు అవకాశం వస్తుందని అనుకున్నానని చెప్పారు. అయితే ఈ అవకాశం తనకు వస్తుందని అనుకోలేదు అని అన్నారు. సరిగ్గా 70 ఏళ్ల తర్వాత బూర్గుల రామకృష్ణారావు తర్వాత మీ బిడ్డ కొండారెడ్డిపల్లిని వదిలి తెలంగాణ సీఎం అయ్యాడు అని రేవంత్ రెడ్డి అన్నారు.

జీడీపీ వృద్ధి గణాంకాలు దారుణం

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

ఈ ఏడాది సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికంలో జిడిపి వృద్ధి రేటు 5.4 శాతానికి పడిపోయిందని కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం విడుదల చేసిన వివేదిక వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిడిపి వృద్ధిరేటు ఊహించిన దానికంటే దారుణంగా పడిపోయిందని శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు. ఇదేక్రమంలో వినియోగం 6 శాతానికి పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఆయన ఆరోపించారు. జిడిపి పడిపోవడానికి ప్రధాన కారణం.. కార్మికుల వేతనాల్లో పెరుగుదల లేకపోవడమేనని.. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం వాస్తవాలను గుర్తించడం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోడీ ఎప్పుడూ కూడా ఆర్థిక వ్యవస్థ మెరుగుపడుతుందని ప్రజల్లో హైప్‌ని సృష్టించారని ఈ మేరకు ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ హయాంలో హరియాణా, అసోం, యూపీలోని కార్మికుల వేతనాలు కూడా క్షీణించాయని జైరాం రమేశ్ ఆరోపించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలో వ్యవసాయ కార్మికులకు ఏటా వేతనాలు 6.8శాతం చొప్పున పెరిగాయని అన్నారు. నరేంద్ర మోదీ హయాంలో వ్యవసాయ కార్మికులకు వేతనాలు ప్రతి ఏటా 1.3శాతం తగ్గాయని విమర్శించారు.

"2017-2022 మధ్య కాలంలో కార్మికులు, స్వయం ఉపాధి కార్మికుల ఆదాయాలు తగ్గాయి. ఇటుక బట్టీ కార్మికుల వేతనాలు తగ్గుముఖం పట్టాయి. దేశ జీడీపీపై వాస్తవాలను ఎంతకాలం విస్మరిస్తారు. ప్రధానమంత్రి హైప్‌ను క్రియేట్ చేస్తున్నప్పుడు దేశ ప్రజలు ఆశతో జీవించడం కొనసాగిస్తున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికంలో జీడీపీ 8.1 శాతం వృద్ధి చెందింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 4.3 శాతం వద్ద మునుపటి కంటే కనిష్ట స్థాయిలో జీడీపీ వృద్ధి నమోదైంది." అని జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

రైతు పండుగ పేరుతో మరో మోసం

- రుణమాఫీ లెక్కనే పాలమూరు అభివృద్ధి హామీ ఉంటదేమో
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రైతు పండుగ పేరుతో రేవంత్ రెడ్డి రైతులను మాయమాటలతో మరోసారి మోసం చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రైతు పండుగ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యల పట్ల ఆయన స్పందించారు. "మహబూబ్ నగర్ రైతు పండుగలో రేవంత్ రెడ్డి సహా మంత్రులు ఎంత మొత్తుకున్నా దండుగే అయ్యింది. ఆడంబరంగా నిర్వహించిన కార్యక్రమం యావత్ తెలంగాణ రైతాంగాన్ని ఉసూరు మనిపించింది. ఏడాది పూర్తయిన సందర్భంగా నైనా రైతులందరికీ రుణమాఫీ, వానాకాలంతో పాటు ఈ యాసంగికి ఇచ్చే రైతు భరోసా మొత్తం కలుపుకొని ఎకరాకు రూ. 15 వేలు ప్రకటిస్తారనుకుంటే మరోసారి మొండి చెయ్యి చూపారు. ఇక కౌలు రైతులు, ఉపాధి కూలీలకు రైతు బంధుకు అతీగతీ లేదు. కేసీఆర్ ప్రారంభించిన రైతు బీమా పథకాన్ని కూడా కాంగ్రెస్ పేటెంటే అంటూ గప్పాలు కొట్టుకోవడం సిగ్గుచేటు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల కాదు, మా కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టుల వల్లనే కోటి 53 లక్షల టన్నుల వరి పండిందని గొప్పలు చెప్పుకోవడం నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్లు ఉంది. మీరు చెప్పిన ప్రాజెక్టులు 2014లో కూడా ఉన్నాయి. మరి అప్పుడు 68 లక్షల టన్నుల వరి మాత్రమే ఎందుకు పండింది రేవంత్ రెడ్డి? 2023-24 నాటికి కోటి 68 లక్షల మెట్రిక్ టన్నుల వరి ఉత్పత్తి ఎలా సాధ్యం అయ్యింది? 2014-15 లో లక్షా 31 వేల ఎకరాలు ఉన్న సాగు విస్తీర్ణం 2023 నాటికి 2లక్షల 21 వేల ఎకరాలకు ఎలా పెరిగింది? చెప్పేవాడికి ఇంగితం లేకున్నా వినేవాడికైనా వివేకం ఉంటది కదా!" అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం చూస్తే రైతుల పట్ల ప్రేమ కంటే, గిరిజనుల నుంచి భూసేకరణ చేయడంలో ఘోరంగా విఫలమయ్యామనే ఆవేదనే కనిపించింది. అభివృద్ధి జరగాలంటే రైతులు నష్టపోవాలని చెబుతున్నవు. పాలమూరు సభ సాక్షిగా ఏ రైతులను బెదిరిస్తున్నావు. పాలమూరు బిడ్డగా ఇది నీకు న్యాయమా? రేవంత్ రెడ్డి. ఒకసారి ఫార్మాసిటీ అని గెజిట్ ఇచ్చి, బీఆర్ఎస్ పోరాటంతో వెనక్కి తగ్గి ఇప్పుడు పారిశ్రామిక కారిడార్ అని ప్రచారం చేస్తున్నావు. ఎటు వాటమైతే అటు మాట్లాడటం నీకే చెల్లింది. మాకొద్దు ఫార్మాసిటీ అంటూ లగచర్లలో లడాయి చేసిన గిరిజన బిడ్డలను అరెస్టులు చేసి జైలుకు పంపించావు. ఇప్పుడేమో సొంత జిల్లా ప్రజల మీద ఎంతో ప్రేమ ఉన్నట్లు మొసలి కన్నీరు కార్చుతున్నావు. రుణమాఫీ చేస్తానని నూటొక్క దేవుళ్ల మీద ఒట్టేసి మాట తప్పావు. ఇప్పుడు నీ మంత్రుల సాక్షిగా ఒట్టు వేసి పాలమూరు అభివృద్ధికి మాటిచ్చావు. రుణమాఫీ లెక్కనే పాలమూరు అభివృద్ధి హామీ ఉంటదేమో" అని హరీశ్‌రావు సెటైర్లు వేశారు.

పాలమూరుకు ఏం చేసావని కేసీఆర్‌ను ప్రశ్నించే హక్కు మీకెక్కడిది..? కాంగ్రెస్ పాలనలో వలసలకు, ఆకలి చావులకు నిలయంగా మారిన పాలమూరు తలరాతను మార్చింది కేసీఆర్, వలసలను

మిగితా 3వ పేజీలో

రాష్ట్రానికి రావాల్సిన వాటా దక్కించుకోవాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాలను దక్కించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలకు వీసమెత్తు నష్టం వాటిల్లకుండా ట్రిబ్యునల్ ఎదుట సమర్థవంతమైన వాదనలు వినిపించాలని ఆదేశించారు. అందుకు అవసరమైన సాక్ష్యాధారాలు, రికార్డులు, ఉత్తర్వులు సిద్ధంగా ఉంచుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులను, న్యాయ నిపుణులను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో సాగునీటి పరిస్థితి, కృష్ణా గోదావరి జలాలపై ఉన్న అంతరాష్ట్ర వివాదాలు, నీటి వాటాల పంపిణీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల నీటి వాటాలు, ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులను బ్రజేష్కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయించాల్సి ఉంది. ట్రిబ్యునల్ ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అభిప్రాయాలను, ఆధారాలను మాత్రమే సేకరించింది. త్వరలోనే ట్రిబ్యునల్ ఎదుట రాష్ట్రాలు తమ వాదనలు వినిపించాల్సి ఉంటుందని, ఆ తర్వాత ట్రిబ్యునల్ నిర్ణయం వెలువడుతుందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.కృష్ణా పరివాహక ప్రాంతానికి సంబంధించి ఇప్పటివరకు ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులు, ఏయే ప్రాజెక్టులకు సంబంధించిన డీపీఆర్లను ఇప్పటికే ట్రిబ్యునల్కు సమర్పించారు.. జలశక్తి మంత్రిత్వ శాఖకు ఇచ్చిన నివేదికలన్నింటినీ వరుస క్రమంలో సిద్ధంగా ఉంచుకోవాలని, వాటి ఆధారంగా

మిగితా 3వ పేజీలో

టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా బుర్రా వెంకటేశం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

టీజీపీఎస్సీకి కొత్త ఛైర్మన్‌గా ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఛైర్మన్ గా ఉన్న మహేందర్ రెడ్డి పదవీ కాలం డిసెంబర్ 3వ తేదీతో ముగియనుంది. ప్రస్తుతం బుర్రా వెంకటేశం విద్యా శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నారు.

బుర్రా వెంకటేశం జనగామ జిల్లాలో జన్మించారు. 1995 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం కీలక శాఖలను చూస్తున్నారు. రాజ్‌భవన్ సెక్రటరీగా ఉండటంతో పాటు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

తెలంగాణపైనా ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తమిళనాడును వణికిస్తున్న ఫెంగల్ తుఫాను తెలంగాణ రాష్ట్రం పైనా ప్రభావం చూపనుంది. ఇప్పటికే పొరుగు రాష్ట్రం ఏపీలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో కూడా ఫెంగల్ తుఫాన్ ఎఫెక్ట్‌తో వర్షాలు కురవనున్నాయి. ఈ తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. ఆది, సోమ వారాల్లో కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. ఫెంగల్ ఎఫెక్టుతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు- వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

జీవో 317 పరిష్కారానికి కొత్త మార్గదర్శకాలు..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలకు (జీవో 317కు) సంబంధించిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సుల మేరకు సీఎస్ శాంతి కుమారి జీఓ ఎంఎస్ నెం.243, 244, 245 మార్గదర్శకాలను జారీ చేశారు. ఉద్యోగుల సమస్యలను మెడికల్, స్పౌస్, మ్యూచువల్ ప్రాతిపదికన పరిష్కరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు వేర్వేరుగా మార్గదర్శకాలు జారీ చేశారు. ఖాళీలకు లోబడి స్థానిక కేడర్‌లో మార్పు, బదిలీకి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియలో ప్రస్తుతం ఆయా స్థానాల్లో ఉన్న ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది.

బిర్యానీల గురించి రీల్స్ చేసే మీరు..

గురుకుల పాఠశాల గురించి ఆలోచించారా?

- మంత్రి కొండా సురేఖకు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కౌంటర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూం

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన ఆరోపణలు, విమర్శలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గురుకుల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. గురుకుల బాట అనే కార్యక్రమం చేపట్టారని తెలిపారు. గురుకుల బాట అని చెప్పగానే కాంగ్రెస్‌కు భయం పుట్టిందన్నారు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కుట్ర చేసి విష ఆహారం తినిపిస్తున్నారంటూ కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మీరు ఒక మాతృమూర్తి.. మీకు ఒక ఆడ పిల్ల ఉంది.. అలాంటి మాటలు మాట్లాడవచ్చా? అని ప్రశ్నిం చారు. తన సొంత పిల్లలను వదిలేసి, వేలాది మంది విద్యార్థులను తన పిల్లలనుకుని సేవ చేశానని చెప్పారు.

వరంగల్‌లో కొండా సురేఖ ఎన్నో అఘాయిత్యాలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. అప్పట్లో మిమ్మల్ని నడిరోడ్డు మీద ఉంచి కౌన్సెలింగ్ ఇచ్చిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. ఇప్పుడు వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అప్పుడు సీఐగా ఉన్నారని.. ఆయనను అడగండి చెబుతాడని అన్నారు. రేవ్ పార్టీల గురించి, బిర్యానీల గురించి రీల్స్ చేసే మీరు.. అన్నం లేని గురుకుల పాఠశాల గురించి ఆలోచించారా? అని నిలదీశారు. కొండా సురేఖ మత్తులో ఉండి మాట్లాడుతున్నారని మండిపడ్డారు.ఘోరమైన చరిత్ర ఉన్న కొండా సురేఖ.. తమ గురించి మాట్లాడితే సహించమంటూ హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకే గురుకుల బాట పట్టామన్నారు. మీకు చేతకాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్‌కు అప్పగించాలన్నారు. కొండా సురేఖ స్థాయికి తాను దిగజార దలుచుకోలేదని అన్నారు. మీరు భవిష్యత్‌లో తెలంగాణలో మాట్లాడవద్దని కొండా సురేఖకు సూచించారు. మీరు మాట్లాడిన మాటలు వినలేక తెలంగాణలో మహిళలు తలదించుకుంటున్నారని అన్నారు.

మహిళలపై కొండా సురేఖ చేసిన ఆరోపణలకు ఆమెపై కేసు పెట్టాలని కోర్టు చెప్పిందన్నారు. ఆమెకు మంత్రిపదవిలో ఉండే అర్హత లేదన్నారు. గతంలో ఐపీఎస్ అధికారిగా ఉన్న తనకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చిందన్నారు. ఏడేళ్ల సర్వీసెస్ వదిలేసి విద్యార్థుల కోసం రాజకీయాల్లోకి వచ్చానని.. తనపై ఆరోపణలుంటే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఆరోపణలకు ఆధారాలుంటే సీబీఐ విచారణకు ఇవ్వండి అని కొండా సురేఖను ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు.

త్వరలో హైడ్రా పోలీస్ స్టేషన్

- హైడ్రా కమిషనర్ రంగనాథ్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్ రాబోతోందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. బేగంపేటలోని ఓ హోటల్‌లో జాతీయ బయోడైవర్సిటీ అథారిటీ, ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్మెంటల్ ఇనిషియేటివ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సుకు రంగనాథ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలపై ఎక్కువగా దృష్టి పెట్టామన్న రంగనాథ్.. లోటస్‌పాండ్‌లో ఏకంగా ఓ వ్యక్తి ఎకరం స్థలం కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే హైడ్రా అడ్డుకుందన్నారు. హైడ్రా చర్యలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, అక్రమ నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టు తీర్పులు కూడా స్పష్టంగా ఉన్నాయన్నారు. ఎక్కువగా సంపన్నులే ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తున్నారశ్రీతీ.. ఆక్రమణలకు గురైన స్థలాల్లో పేదలకంటే ధనికులే ఎక్కువగా ఉన్నారన్నారు. అన్ని రాజకీయ పార్టీలవారు ఆక్రమణల్లో ఉన్నారని.. ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎవరినీ వదలమని తెలిపారు. హైడ్రాకు వచ్చే ఫిర్యాదులను పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురుకులాలలో అక్రమాల పాపం బీఆర్ఎస్‌దే..

- రాజకీయాల కోసం గురుకులాలను బీఆర్ఎస్ వాడుకుంటోంది
- గత పదేండ్లలో గురుకులాలకు అద్దెభవనాలు తప్ప సొంత భవనాలు లేవు..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ, సిరిసిల్ల

గురుకులాల లో ఉండే పిల్లలపై బీఆర్ఎస్ పార్టీవి కపట నాటకాలు ఆడుతున్నదని,అధికారం పోయిందన్న ఫ్రస్టేషన్ తో ప్రజల్లోకి ఏ అంశంతో వెళ్లాలో తెలియక చిన్న పిల్లల మరణంపైకూడా బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గంభీరావుపేట మండలం దమ్మన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యా ర్థిని శైలజ మృతి చెందడం బాధాకరం అని అన్నారు.వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఆహార కలుషితంతో పలువురు అమ్మాయిలకు సమస్యతలెత్తగానే హుటాహుటిన ఆసుపత్రులకు తరలించి చికిత్స అందించామని అన్నారు. శైలజకు మెరుగైన వైద్యం కోసం నిమ్స్ కు తరలించామని చికిత్స జరుగుతున్న సమయంలో ప్రభుత్వం తరుపున నిరంతర పర్యవేక్షణజాగ్రత్తలు అన్ని తీసుకున్నామని, మంత్రి దామోదర రాజనర్సింహ ,మంత్రులు పొన్నం ప్రభాకర్ నిమ్స్ ను సందర్శించరు అని అన్నారు.పదేండ్లలో గురుకులాలకు అద్దెభవనాలు తప్ప సొంత భవనాలు లేవు అని, కానీ కేసీఆర్ ఫాం హౌజ్ జన్వాడలో కేటీఆర్ ఫాం హౌస్ లు నిర్మించుకున్నారు తప్ప,గురుకులాలకు మాత్రం సరైన వసతులు, భవనాలు నిర్మించ లేదు అని అన్నారు. మా ప్రజా ప్రభుత్వంలో గురుకుల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచామని, ప్రతి నియోజకర్గంలో 25 ఎకరాల్లోఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోంది అని అన్నారు.మధ్యా హ్న భోజన తనిఖీ కోసం జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ లో లుఏర్పా టు ప్రతి పాఠశాలలో భోజన కమిటీలుఏర్పా టు చేస్తున్నా నా మనీ అన్నారు.103 గురుకులాల స్కూ ల్స్ బిల్డింగులు అన్నీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ల బంధువుల ఇండ్లలో కిరాయి నడిపించారు అని అన్నారు. ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ దాదాపు 1000 మందిస్టాఫ్ ను ప్రభుత్వ అనుమతిలేకుండారిక్రూట్ చేసిండు అని,నెలకు రూ. 9 కోట్లు ఇష్టారీతిన ఖర్చు చేసిండు అని,వాళ్ళంతా ప్రవీణ్ కుమార్ అనుచరగణంగాఉంటున్నారు అని అన్నారు.

ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ గురుకులాల్లో పెద్దస్థాయిమాఫియాను నడిపారు, ప్రతిజిల్లాలో కమ్యు నిటి రిలేషన్ఆఫీసర్ ను ఎలాంటి నిబంధనలు పాటించకుండా నియమించారు అని వీరంతా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అనుచరులే అని అన్నారు. మేము అధికారంలోకి రాగానే గురుకులపై దృష్టి పెట్టామని, గత ప్రభుత్వంలో జరిగిన వ్యవహరాలకు అడ్డుకట్ట వేసేసరికి, ప్రభుత్వంపైబురుద చల్లుతున్నా రు అని అన్నారు. గురుకులపై కావాలనే రాజకీయం చేస్తున్నారని, కేటీఆర్ సభ్యతగా మాట్లాడాలని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని, మేము మాట్లాడవచ్చు అని, కానీ సంస్కారం అడ్డు వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్,నాయకులు సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, పర్స హన్మ%శీ%డ్లు, బొప్ప దేవయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా నిధులు

తంగళ్లపల్లి: మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేస్తున్నదని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. తంగళ్ళపల్లి మండలం పద్మనగర్ హెచ్ పీ పెట్రోల్ పంపు నుంచి మండేపల్లి మల్లుపల్లె వరకు బీటీ రోడ్డుకు సీఆర్ ఆర్ నిధులు 2 కోట్ల 25 లక్షల రూపాయలు, ఆర్%డ%బి రోడ్డు నుండి ఆశ్రమం వరకు రూ. 60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణనికి నిధులు మంజూరు కాగా పనులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం విప్ మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. ఇటీవల సీఆర్ఆర్ నిధులు రూ.18 కోట్లతో జిల్లాలోని పలు చోట్ల రోడ్లకు మంజూరు చేసి, పనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

వృద్ధులకు ఆత్మీయ పలకరింపు

తంగళ్లపల్లి మండల కేంద్రంపరిధిలోని ఓ వృద్ధాశ్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సందర్శించారు. తంగళ్లపల్లిలోని లగిశెట్టి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలోని వృద్ధాశ్రమం కొనసాగుతుండగా, విప్, కలెక్టర్ కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వృద్ధులను ఆత్మీయంగా పలుకరించి, యోగ క్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక సంతోషిమాత ఆలయంలో పూజలు చేశారు.

ఘనంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల నిర్వహణ

- డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు విజయోత్సవాలు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝు

బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల

డిసెంబర్ 1 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం లో ఘనంగా ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల నిర్వహిస్తున్నట్లు జ కలెక్టర్ సందీప్ కుమార్ ఝు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ డిసెంబర్ 1న విద్యా శాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలల రెండవ దశ నిర్మాణాల శంకు స్థాపన కార్యక్రమాలు నిర్వహిస్తామని, పాఠశాల విద్యార్థు లకు స్వీట్ల పంపిణీ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, సీఎం కప్ పేరిట క్రీడ పోటీలు నిర్వహణ ఉంటుందని అన్నారు. డిసెంబర్ 2న 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కళాశాలలను,213 నూతన అంబులెన్స్ , 33 ట్రాన్స్ జెండర్ ల క్లినిక్ లు ప్రారంభిస్తారని అన్నారు. డిసెంబర్ 3న హైదరాబాదులో నిర్మించిన అరంఘర్ నుంచి జూ పార్క్ ఫ్లై ఓవర్, 485 ఎం.ఎల్.డి సామర్థ్యం గల 6 ఎస్టిపి, 150 కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనులు, 17 కోట్లతో చేపట్టిన వర్షపు నీరు నిల్వ స్ట్రక్చర్స్ ప్రారంభిస్తారని, అదే సమయంలో కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ పనులు, 5942 కోట్లతో చేపట్టే హెచ్.సి.ఐ.టి.ఐ పనులు, 586 కోట్లతో చేపట్టే ఎస్.ఎన్.డి.పి పనులు శంకుస్థాపన జరుగుతుందని అన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలో కార్యాలయాల్లో విద్యుత్ దీపాలంకరణ చేయడం, మున్సిపల్ కార్మికులకు హెల్త్ క్యాంప్ ల నిర్వహణ, పారిశు ధ్య సిబ్బందికి అవసరమైన సేఫ్టీ ఎక్విప్మెంట్, పిపిఈ పంపిణీ , అమృత పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని అన్నారు.

డిసెంబర్ 4న హైదరాబాదులో తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ బోనా నెక్ శంకుస్థాపన, వర్చువల్ సఫారీ థీం పార్క్, వృక్ష పరిచయ క్షేత్రం ప్రారంభిస్తారని, అదే రోజు సాయంత్రం పెద్దపల్లి జిల్లాలో బహిరంగ సభ నిర్వహించి 9007 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తారని తెలిపారు. డిసెంబర్ 5న హైదరాబాద్ మాదాపూర్ లో మహిళా శక్తి బజార్ ప్రారంభోత్సవం, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం విజయాల పై శివశక్తి మహిళా సంఘాలలో చర్చ నిర్వహించాలని అన్నారు. డిసెంబర్ 6న ఈ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రారంభోత్సవం, 244 సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన ఉంటుందని అన్నారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు హైదరాబాదులో ఘనంగా వేడుకలు జరుగుతాయని అన్నారు. డిసెంబర్ 7న స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, విద్యుత్ శాఖకు నూతన ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనాలు ప్రారంభిస్తామని అన్నారు. డిసెంబర్ 8న ఏఐ నగరానికి శంకుస్థాపన, 7 నూతన ఏఐ ఇన్నిసేటివ్, 130 నూతన పౌర సర్వీసులు, కమలాపురం ఫ్యాక్టరీ పునరుద్ధరణ మొదలగు 15 పరిశ్రమలతో ఎమ్ఓయూలు, స్పోర్ట్స్ యూనివర్సిటీ కు శంకుస్థాపన ఉంటుందని, డిసెంబర్ 9న హైదరాబాద్ సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహాన్ని లక్ష మంది మహిళల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజాపాలన ప్రజా దినోత్సవ కార్యక్రమాలు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి..

- పోలీస్ శాఖలో అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వర్థించాలి..
- ఎస్పీ అఖిల్ మహాజన్

బలగం టీవీ, సిరిసిల్ల

క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో పూర్తి నిబద్ధతతో,అంకితభావంతో,క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకారావలని,పోలీస్ శాఖ అనుసరిస్తున్న సాంకేతక పరిజ్ఞానం అందిపుచ్చుకోవలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాకు చేరుకున్న నూతన సివిల్ ఆర్మడ్ రిజర్వ్ కానిస్టేబుల్ తో ఎస్పీ అఖిల్ మహాజన్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ శరీరకంగా మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ఎలాంటి సవాళ్లనైన ఎదుర్కొని నిలబడవచ్చు అని అన్నారు. తొమ్మిది నెలల శిక్షణలో నేర్చుకున్న నూతన చట్టాలపై నిరంతరం పటనం చేస్తూ అన్ని చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.ఉన్నత అధికారుల ఆదేశాలను పాటిస్తూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని,విధి నిర్వహణలో ఎలాంటి అలసత్వం చూపిన,శాఖ పరమైన చార్యలుంటాయన్నారు. విజిబుల్ పొలిసింగ్ లో భంగంగా అమలు చేస్తున్న విలేజ్ పోలీసింగ్ లో భాగంగా తమకు కేటాయించిన గ్రామాలపై పట్టు సాధించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఫంక్షనల్ వర్టికల్స్ పై పూర్తి అవగాహన కలిగి ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిచాలని తెలిపారు.ఆర్మడ్ రిజర్వ్ సిబ్బంది నాకబంది,పికెట్స్,విఐపి బందోబస్త్ డ్యూటీస్,వివిధ బందోబాస్త్ డ్యూటీలలో ,ప్రిసనర్,క్యాష్ ఎస్కార్ట్స్,లా అండ్ ఆర్డర్ విధులలో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్.ఐ కు రమేష్, మధుకర్, ఆర్.ఎస్.ఐ శ్రవణ్ యాదవ్, కమ్యూనికేషన్ సి.ఐ శ్రీలత ,నూతన కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలి

- టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్

బలగం టీవీ , సిరిసిల్ల

సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, సమానమైన విద్యార్హతలు ఉన్నప్పటికీ కూడా వారిని ఓటు హక్కుకు దూరం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్యాయం చేయడమే అని టీపీటీఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల లోని కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి టీపీటీఫ్ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నబోయిన తిరుపతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విద్యాశాఖ కు సంభందించిన అంశాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.మధ్యాహ్న భోజనం సంబంధించి బిల్లులు సరిగా మంజూరు చేయకుండా సరైన వసతులు కల్పించకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం సరైన విధానం కాదు అని అన్నారు.. పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని చాలావరకు బిల్లులు సాంక్షన్ కావడం లేదని రిటైర్మెంట్ అయిన వారు కూడా బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.. కాబినెట్ సబ్ కమిటీ ఇచ్చిన రిపోర్టు మేరకు నేడు రాష్ట్ర ప్రభుత్వం స్పౌజ్, విడోస్, మ్యూచ్ వల్ బదిలీలపై జారీ చేసిన మార్గదర్శకాలను స్వాగతిస్తున్నాం అని అన్నారు. 317 జీవో ద్వారా అన్యాయం జరిగిన ఇతరు ఉపాధ్యాయ ఉద్యోగులకు కూడా న్యాయం చేయాలిని,స్పోస్ కేటగిరీలో సెంట్రల్ హౌస్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా చేర్చాలని,317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు కూడా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విక్కుర్తి ఆంజయ్య, సీనియర్ నాయకులు కిషన్ రావు, పంజాల వెంకన్న, ఉపాధ్యక్షులు పురం వాసుదేవ రావు, దబ్బెడ హన్మండ్లు, నూగురి దేవేందర్, మందాది శ్రీనివాస్ రెడ్డి, రజిని రాణి, పార్వతి తిరుపతి, మైలారం తిరుపతి, చకినాల రామచంద్రం, ఎడ్ల కృష్ణ చైతన్య, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, బాధ్యులు పాల్గొన్నారు

ప్రేరణ స్వచ్ఛంద సంస్థకు
రాష్ట్ర స్థాయి ఉత్తమ సామాజిక సేవ అవార్డు

బలగం టీవీ, సిరిసిల్ల

తెలంగాణ రాష్ట్ర స్థాయి లో బ్యాక్వర్డ్ క్లాసెస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (బిక్కి) ప్రకటించిన అవార్డుల్లో ఉత్తమ సామాజిక సేవ విభాగంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ఉత్తమ సామాజిక సేవ అవార్డు అందుకుంది.శనివారం హైదరాబాద్ లోని టి హబ్ వేదిక గా జరిగిన అవార్డుల ప్రధానోత్సవం లో రాష్ట్ర బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్,ఎమ్మెల్సీ మధుసూదనా చారి చేతుల మీదుగా ప్రేరణ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అన్నారపు వేణుగోపాల్, వెల్దండి సాయి కృష్ణ, నీలి సంతోష్ లు అవార్డు ను అందుకున్నారు.ఈ కార్యక్రమం లో బిక్కి సంస్థ బాధ్యులు ప్రముఖ ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి, చేరాల వెంకటస్వామి, దాసరి కిరణ్ లు పాల్గొన్నారు..

శ్రీ రాజరాజేశ్వర మధ్యమానేరు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

- కారిడార్ ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- సీపీఐ(ఎం) మండల శాఖ డిమాండ్.

బలగం టీవీ , బోయినిపల్లి

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.రాజన్న సిరిసిల్ల జిల్లాలో శ్రీ రాజరాజేశ్వర (మధ్యమానేరు) భూములు కోల్పోయిన రైతులకు, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఇక్కడ ఈ ప్రాంతంలో కారిడార్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీనిచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం పూర్తిగా వస్తున్న సందర్భంలో ఇప్పటికీ ఆ కారిడార్ కు సంబంధించిన విధి విధానాలు, రూపకల్పన చర్యలో భాగంగా ఆ దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్టుగా ఎక్కడ కనబడడం లేదని,మధ్య మానేరు భూములు ఇచ్చి, సర్వం కోల్పోయి, ఉపాధి లేక, ఎప్పుడు పని దొరుకుతుందో తెలియని అయోమయ స్థితిలో అక్కడి ప్రజానీకం, అలాగే చదువుకున్న యువకులకు ఉపాధి లేక చదివిన చదువుకు అర్థం లేక కూలినాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. మరి ఈ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకొని, మధ్య మానేరు నిర్వహిస్తులకు అండగా నిలబడి, కారిడార్ ఏర్పాటు చేయాలని, అలాగే మధ్య మానేరు నిర్వసితులలో ఇల్లు లేని వారిని గుర్తించి, పారదర్శకంగా విచారణ చేపట్టి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఐదు లక్షల నాలుగు వేల రూపాయలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మండల సీపీఐ(ఎం) పక్షాన పార్టీ మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, మధ్య మానేరు నిర్వాసితులు సింగిరెడ్డి శంకర్, కడదుల రవి, అనుముల రవి, ఆవుల మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి..

- ఎస్పీ అఖిల్ మహాజన్

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

పదవి విరమణ పొందిన పోలీసు అధికారులు అమ్మ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శనివారం పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ ఎండి .ఇస్మాయిల్ ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అఖిల్ మహాజన్ శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఏఎస్ఐ కి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని అన్నారు . పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి సూచించారు . పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని సూచించారు. తమ ఆరోగ్యాల పట్ల తగు జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు.ఎటువంటి అవసరం ఉన్న పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,సిఐ మధుకర్,ఇస్మాయిల్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కతర్‌లో పెద్దూరు వాసికి అవార్డ్...

బలగం టీవీ, సిరిసిల్ల

బిజీ బిజీ కాలంలో తన పని కాకుండా ఇతరుల గురించి ఆలోచించే వ్యక్తులు చాలా అరుదుగా ఉంటారు,అందులో ఒకరు రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరు వాసి తల్లపెళ్ళి ఎల్లయ్య గౌడ్. కతర్ లో దేశంలో ఇండియన్ ఎంబాసి ఆధ్వర్యంలో నడిచే ఐసీబీఫ్ సంస్థా సమాజ సేవ చేస్తున్న వారిని ప్రతిష్టాత్మకంగా గుర్తించి ప్రతి సంవత్సరం అవార్డులు ఇవ్వడంజరుగుతుంది. అందులో భాగంగా ఈ సంవత్సరం తెలంగాణ రాష్టం తరపున గత 15 సంవత్సరాల నుంచి కతర్ లో సేవ చేస్తున్న తల్లపెళ్ళి ఎల్లయ్య ని గుర్తించి అవార్డు అందజేయడం జరిగింది. ఐసీబీఫ్ డే కార్యక్రమం సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారత రాయబారి విపుల్ చేతుల మీదుగా ఎల్లయ్య గౌడ్ ఈ అవార్డ్ అందుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రవాసిలు మరియు ఇతర రాష్ట్రాల ప్రవాసిలు దాదాపు 2000 మంది హాజరయ్యారు..

సీసీఐ పత్తి గోడౌన్‌లో అగ్ని ప్రమాదం

బలగం టీవీ, మేడ్చల్

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలో సీసీఐ గోడౌన్ లో శనివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది.. పత్తి కావడంతో క్షణాలలో మంటలు గిడ్డంగి అంతా వ్యాపించాయి.. చూస్తుండగానే కోట్ల విలువైన కాటన్ బూడిదైంది. మంటల ధాటికి గోడౌన్ భవనం కుప్పకూలింది. ప్రమాదవార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు అదుపుచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక . మంటలు చెలరేగిన వెంటనే గమనించిన కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీయడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. రూ.కోట్లలో నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోం..

- కేటీఆర్ తన భాషను మార్చుకోవాలి
- కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలి..
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతాని కృషి చేయాలని ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ అన్నారు.శనివారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇంఛార్జి కేకే మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సిరిసిల్ల పాలిస్టర్ అసోసియేషన్ సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలో కి ఆహ్వానించినారు.ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ లో రైతు పండగ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీలో వారు చేరడం ఒక మార్పునకు నాంది అని అన్నారు. గతంలో చెప్పినట్టుగానే జిల్లా అభివృద్ధి ఎక్కడ ఆగదు అని,ఎవరు కష్టాల్లో ఉన్న వారికి అండగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉంటుంది అని అన్నారు.గత ప్రభుత్వం పెట్టిన 270 కోట్ల బకాయిలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో, జిల్లా మంత్రులు శ్రీధర్ బాబు పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నేతన్నలకు చెల్లించడం జరిగింది అని అన్నారు.గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట నాసిరకం చీరలు ఇచ్చిందని, వాటిని వ్యతిరేకిస్తూ మహిళా తల్లులకు చక్కటి చీరలు అందించే విధంగా కోటి పైగా చీరెలు నేతన్నలకు ఆర్డర్ ఇచ్చామని అన్నారు.30 సంవత్సరాల నేతన్నల కల యారన్ డిపో, దాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వేములవాడలో ఏర్పాటుచేసిందని,

గతంలో నేతన్నలు రెండు రాష్ట్రాలు దాటి వెళ్లి నూలు తీసుకురావాల్సిన పరిస్థితి ఉండేది ఇప్పుడు ఆ పరిస్థితి లేదు అని అన్నారు. గత పాలకులకు మన ప్రాంతంలోనూలు డిపో ఏర్పాటు చేయాలని ఆలోచన రాలేదు అని, నా చర్మం ఒల్చి మీకు చెప్పులు కొట్టిస్తానని, గొప్ప గొప్ప మాటలు చెప్పి మన ప్రాంత ప్రజలపై మోసలి కన్నీరు కార్చారు అని అన్నారు. గత ప్రభుత్వంలో రెండవ స్థానంలో ఉండి యువరాజుగా చలామణిగా అయిన కేటీఆర్ నేతన్నలకు బకాయిలు పెట్టారు అని అన్నారు. ఐఏఎస్ ఐపీఎస్ లను పట్టుకొని ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం, జిల్లా కలెక్టర్ ను కాంగ్రెస్ కార్యకర్తగా అభివర్ణించడం ఎంతవరకు సబబు అని అన్నారు.

కేటీఆర్ అధికారం పోయిన ఫ్రస్టేషన్లో సిరిసిల్లలో తన పీఠాలు కదులుతున్నాయని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు అని,కలెక్టర్ నుంచి ముఖ్యమంత్రి వరకు వారిపై బూతులు మాట్లాడితే సగటు కాంగ్రెస్ కార్యకర్త చూస్తూ ఊరుకోడు అని అన్నారు.ఆనాడు జిల్లా కావాలని ఉద్యమకారులు ప్రజలందరూ రోడ్ ఎక్కినప్పుడు ఢిల్లీలో ఉండి జిల్లాగా చేయడం వీ

5న మహారాష్ట్రలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు

బలగం టీవి, ముంబై

మహారాష్ట్రలో మహాయుతి కూటమి కొత్త ప్రభుత్వం డిసెంబర్ 5న ఏర్పాటు అవుతుందని, దేవేంద్ర ఫడ్నవీస్ తదుపరి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉందని బిజెపి సీనియర్ నేత ఒకరు శనివారం ప్రకటించారు. నవంబర్ 20న జరిగిన మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి 288 అసెంబ్లీ సీట్లకు ఏకంగా 230 సీట్లు గెలుచుకుని అధికారాన్ని నిలబెట్టుకున్నది. 132 సీట్లతో బిజెపి అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించగా, శివసేన 57, ఎన్‌సిపి 41 సీట్లు సాధించాయి. అయితే, ఎన్నికల ఫలితాలు ఒక వారం క్రితం (నవంబర్ 23న) ప్రకటించిన పిమ్మట కూడా ప్రభుత్వం ఏర్పాటు ఆలస్యం అయింది. తదుపరి ముఖ్యమంత్రి అభ్యర్థిని త్రిపక్ష కూటమి ఇంకా నిర్ణయించకపోవడం అందుకు కారణం.

తదుపరి ప్రభుత్వానికి సంబంధించి అధికారం పంపిణీ గురించి చర్చించేందుకు షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ గురువారం రాత్రి పొద్దుపోయిన తరువాత బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డాను, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షాను కలుసుకున్నారు. శుక్రవారం జరగవలసిన మహాయుతి కీలక సమావేశం వాయిదా పడింది. అది ఆదివారం జరగవచ్చు. ఆపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సతారా జిల్లాలోని స్వగ్రామానికి వెళ్లడంతో ప్రభుత్వం ఏర్పాటు మరింత ఆలస్యం అయింది. కాగా, కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారం డిసెంబర్ 5న జరుగుతుందని పేరు వెల్లడికి ఇష్టపడని బిజెపి నేత చెప్పారు. రెండు సార్లు ముఖ్యమంత్రిగా, గత ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన బిజెపి సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్ సిఎం పదవికి ప్రధాన అభ్యర్థిగా ఉన్నారని ఆ నేత తెలిపారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం దక్షిణ ముంబయిలోని అజాద్ మైదాన్‌లో జరుగుతుందని మరొక సీనియర్ బిజెపి నేత తెలియజేశారు.దానికి ముందుగా బిజెపి శాసనసభా పక్షం నేతను ఎన్నుకునేందుకు డిసెంబర్ 2న ఒక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

పాలంలో రైతుపై పులి దాడి

బలగం టీవి, హైదరాబాద్

ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లాలో పులి దాడులు వరుసగా కొనసాగుతున్నాయి. శుక్రవారం లక్ష్మి అనే మహిళా కూలీపై పులి దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. ఈ ఘటన మరువకముందే శనివారం ఉదయం మరో రైతుపై పులి దాడి చేసింది. సిర్పూర్ టౌన్ దుబ్బగూడ వద్ద పత్తి చేనులో పనిచేస్తున్న రౌతు సురేశ్‌పై పులి వెనుక నుంచి దాడి చేసింది. ఆ సమయంలో సురేశ్ గట్టిగా అరవడం తో పక్కనే పంట పొలాల్లో ఉన్న తోటి రైతులు అక్కడికి కేకలు వేస్తూ పరుగున రావడంతో పులి అక్కడి నుండి అడవిలోకి పారిపోయింది. గాయపడిన రైతును వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించి మె రుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తీసుకెళ్లారు. వరుసగా పులి ప్రజలు, పశు సంపదపై దాడి చేస్తున్న నేపథ్యం లో అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

కాగజ్‌నగర్, సిర్పూర్ తిన్మండలంలో ఆంక్షలు వి ధించారు. ఇప్పటికే 15 గ్రామాల్లో 144 సెక్షన్ విధించారు. పులి కదలికలపై నిఘా పెట్టేందుకు ఎక్కడికక్కడ బో నులు, కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇస్‌గాం, నజ్రుల్‌నగ ర్, సీతానగర్, అన్కోడ, గన్నారం, కడంబ, ఆరెగూడ, బా బునగర్ గ్రామాల పరిసరాలలో పులి సంచరిస్తోందని అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతానికి సమీపంలో ని వసించే ప్రజలు పొలం పనులకు వెళ్లవద్దని హెచ్చరించారు. గత నాలుగేళ్లలో ఇక్కడ పులుల సంఖ్య అనూహ్యం గా పెరిగిందని వారన్నారు. అందుకే ఆయా ప్రాంతా ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు సూచిస్తున్నారు.

రాష్ట్రానికి రావాల్సిన వాటా దక్కించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ట్రిబ్యునల్ ఎదుట పకడ్బందీగా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు, అంతర్జాతీయ నీటి సూత్రాల ప్రకారం నదీ పరివాహక ప్రాంతాన్ని బట్టి అదే దామాషా ప్రకారం నీటి కేటాయింపులుండాలి. కృష్ణా పరివాహక ప్రాంతం తెలంగాణలో 70 శాతం ఉండగా.. ఏపీలో కేవలం 30 శాతం ఉంది. అదే వాదనల ప్రకారం 1005 టీఎంసీల్లో 70 శాతం నీటి వాటా తెలంగాణకు దక్కేలా వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పోలవరం ద్వారా 80 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ కృష్ణా డెల్టాకు వినియోగిస్తున్నందున, వాటికి బదులుగా నాగార్జునసాగర్ ఎగువన 45 టీఎంసీలు తెలంగాణకు నీటి కేటాయింపులున్న విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ నీటి వాటాను ఎగువన ఉన్న ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ ఇప్పటివరకు పూర్తి చేయనందున, కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీల నిర్ణయాలను ఎందుకు పట్టించుకోవాలని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ట్రిబ్యునల్ నీటి వాటాల పంపిణీ పూర్తయ్యేవరకు గోదావరి, కృష్ణా బోర్డుల జోక్యం ఉండకూడదని సుప్రీం కోర్టులో వాదనలు వినిపించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

వివిధ ప్రాజెక్టుల ద్వారా కృష్ణా జలాల్లో కోటాకు మించి ఎక్కువ నీటిని ఏపీ తరలిస్తోందని చర్చ జరిగింది. నీటి ప్రవాహాన్ని శాస్త్రీయంగా లెక్కించే టెలీ మెట్రీ విధానంతో దీనికి అడ్డుకట్ట వేసే వీలుందని అధికారులు సీఎంకు వివరించారు. టెలీ మెట్రీ పరికరాలకయ్యే రూ.12 కోట్లు రెండు రాష్ట్రాలు చెరి సగం చెల్లించాలని అధికారులు సీఎంకు వివరించారు. అవసరమైతే మొత్తం డబ్బులు ముందుగా భరించి టెలీమెట్రీ అమల్లోకి తీసుకురావాలని, ఏపీ ఇచ్చినప్పుడు రీయింబర్స్ చేసుకోవాలని సీఎం సూచించారు. నీటి వినియోగం విషయంలో జరుగుతున్న అన్యాయానికి అడ్డుకట్ట వేయాలని అధికారులను ఆదేశించారు. కృష్ణాపై ఉన్న ప్రాజెక్టులన్నింటి ద్వారా ఏ రాష్ట్రం ఎన్ని నీళ్లు వాడుకుంటుందో లెక్కలు తీయాలని ఆదేశించారు. శ్రీశైలం, పోతిరెడ్డిపాడు, బంకుచెర్ల హెడ్ రెగ్యులేటరీ, తెలుగు గంగ, కేసీ కెనాల్, హంద్రీ నివా, గాలేరు నగరి, వెలుగోడు ప్రాజెక్టుల నుంచి ఎంత నీటిని తరలిస్తున్నారనే వివరాలన్నీ రికార్డు చేయాలని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు, సమ్మక్క బ్యారేజీకి అవసరమైన అనుమతులు తీసుకోవాలని, పూర్తి ఆయకట్టుకు నీరందించేందుకు అవసరమైన పనులన్నీ తొందరగా చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

ప్రాజెక్టులు, నీటి వాటాలకు సంబంధించి సమర్థంగా వాదనలు వినిపించేందుకు 2014 నుంచి ఇప్పటివరకు ఉన్న జీవోలు, తీర్పులే కాకుండా.. ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన జీవోలు, మెమోలు, ప్రాజెక్టుల డీపీఆర్లు, అప్పటి నుంచి నీటి వాటాల్లో తెలంగాణకు జరిగిన నష్టాలపై సమగ్రంగా నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. వీటి ఆధారంగా అన్ని వేదికలపై తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించేలా సమర్థమైన వాదనలు వినిపించాలని సూచించారు.ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి, స్టాండింగ్ కౌన్సిల్ వైద్యనాథన్, ఏజీ సుదర్శనెడ్డి, అడిషనల్ ఏజీ రజనీకాంత్ రెడ్డి, ప్రభుత్వం తరపు న్యాయవాది ఖుష్ వోరా, సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, సీఎం సెక్రెటరీ మాణిక్రాజ్, నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇరిగేషన్ కార్యదర్శి ప్రశాంత్ పాటిల్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రైతు పండుగ పేరుతో మరో మోసం

(మొదటి పేజీ తరువాయి)

వాపస్ తెచ్చింది కేసీఆర్. మీ పాలనలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చింది కేసీఆర్. కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టుల్లో 2014 వరకు కేవలం 27 వేల ఎకరాలు సాగైతే, దాన్ని ఆరున్నర లక్షల ఎకరాలకు పెంచింది కేసీఆర్. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించి 90 శాతం పూర్తి చేస్తే, ఏడాది పాలనలో మీరు మిగిలిన చివరి పనులు కూడా పూర్తి చెయ్యక చోద్యం చూస్తున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 5 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదైతే అది కూడా మీ ఖాతాలో వేసుకున్నావు అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.

రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు

- **కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణలో అరకొర రుణమాఫీ చేసి మొత్తం పూర్తి చేశామని కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అదేవిధంగా 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు నోటిఫికేషన్లు రాలేదని, గత ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలనే వీళ్లు భర్తీ చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని, అందుకు గత పార్లమెంటు ఎన్నికలే నిదర్శనమన్నారు. తెలంగాణలో బీజేపీకి మంచి భవిష్యత్ ఉందని ఇటీవల తనను కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో ప్రధాని నరేంద్ర మోడీ ఆశాభావం వ్యక్తం చేశారన్నారు. ప్రజల తరపున ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేయాలని ప్రధాని పిలుపునిచ్చారని.. అదే స్ఫూర్తితో ముందుకు వెళతామన్నారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సభ్యత్వ నమోదు, బీజేపీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియపై కిషన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర సంస్థాగత వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సునీల్ బన్సాల్ పాల్గొని బూత్, మండల స్థాయి కమిటీల నియామకంపై జిల్లా అధ్యక్షులు, సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జ్‌లకు దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడారు. భాజపా ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేసే పార్టీ అని, గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలు వేసుకుంటున్నామన్నారు. ప్రజా సమస్యలతోపాటు ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలకు గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్రమే నిధులు ఇస్తోందన్నారు. రాష్ట్రంలో రానున్న రోజుల్లో ప్రజలను సంఘటితం చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని మంచి నాయకత్వం వచ్చేలా కమిటీలు వేయాలన్నారు.

ఏదేమైనా రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతాం

- **మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

బలగం టీవి, మహబూబ్‌నగర్

ఏదైమైనా ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా రైతులకు రూ.2 లక్షల పంట రుణమాఫీ చేసి తీరుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు. కొన్ని సమస్యల వల్ల రుణమాఫీ వర్తించని వారిని గుర్తించి మళ్లీ రుణమాఫీ చేస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన-ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు మహబూబ్ నగర్?లో ప్రభుత్వం రైతు పండగ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భాగంగా శనివారం రైతు పండగ ముగింపు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత పదేళ్లలో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అయ్యింది.. ఆర్థికంగా ఆగమైనా రాష్ట్రాన్ని మేం అధికారంలోకి వచ్చాక చక్కదిద్దుకుంటూ వస్తున్నామని తెలిపారు. గత బీ ఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్?లో పెట్టిన రూ.7వేల కోట్ల రైతు భరోసాను మా ప్రభుత్వమే చెల్లించిందని చెప్పారు. బీఆర్ఎస్ పూర్తి చేయలేకపోయిన రుణమాఫీని కూడా మేమే పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రంలో వరి ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేస్తున్నామన్నారు.

కోఠి ఉమెన్స్ కాలేజీలో విద్యార్థినుల నిరసన

బలగం టీవి, హైదరాబాద్

హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీ.. విద్యార్థినుల నిరసనలతో అట్టుడుకింది. కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళ విశ్వవిద్యాలయాన్ని యూజీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు శనివారం కళాశాల మెయిన్ గేటు వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న కోఠి మహిళా కళాశాలను తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ మహిళా యూనివర్సిటీగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంగా పేరు మార్చారని తెలిపారు. అయితే తమ ఐడీ కార్డులలో తెలంగాణ మహిళా యూనివర్సిటీగా కార్డు ఇస్తున్నారని, కానీ తమ సర్టిఫికెట్లలో ఎలా ఇస్తారో తెలియక గందరగోళంగా ఉందన్నారు. తాము ఎంతో మనోవేదన గురవుతున్నామని తెలిపారు. ఇంతవరకు యూజీసీలో చేర్చలేదని, తమ డిగ్రీ పూర్తి అవుతున్న నేపథ్యంలో తమకు ఏ ప్రాతిపదికన సర్టిఫికెట్ ఇస్తారని ప్రశ్నించారు. తమ భవిష్యత్తు అయోమయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని రానున్న అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో యూజీసీలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న వీసీ సూర్య ధనుంజయ్ అక్కడికి చేరుకొని విద్యార్థులను సముదాయించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

యాషెస్ కంటే భారత్-ఆస్ట్రేలియా పోరే పెద్దది

- ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్

బలగం టీవి, అడిలైడ్

ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్ కీలక వ్యాఖ్యలు చేశారు. యాషెస్ సిరీస్ కంటే ఇండియా ఆస్ట్రేలియా మధ్య పోరే పెద్దదని అన్నారు. యాషెస్ సిరీస్‌ను తలదన్నేలా ఈ పోరు ఉంటుందని అన్నారు.

ఆసిస్ ప్రైమినిస్టర్స్ లెవెన్‌తో భారత్ వార్మప్ మ్యాచ్ ఆడనున్న నేపథ్యంలో క్రికెటర్లు ఆయనను కలిశారు. భారత్- ఆసీస్ ప్రైమ్‌మినిస్టర్స్ జట్లతో మరోసారి ఫొటోలు దిగి, వారితో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్రికెట్‌ని చూసే వారి సంఖ్య బాగా పెరిగిందని.. ఐపీఎల్ సైతం మెగా లీగ్‌గా మారిందని తెలిపారు. ఇక 1992 తర్వాత భారత్ ఆసీస్ ఐదు టెస్టుల సిరీస్‌ను తొలిసారి ఆడటం బాగుందని పేర్కొన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి నేనూ అహ్మదాబాద్ స్టేడియంలో వన్డే ఫైనల్ మ్యాచ్‌ను చూశాను. టెస్టులను చూసేందుకు కూడా ఇప్పుడు ప్రేక్షకులు భారీగా స్టేడియాలకు వస్తున్నారు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లోనూ భారత్- ఆసీస్ జట్లు తలపడ్డాయి. అప్పుడు లండన్‌లో మేం విజయం సాధించాం. కానీ, సిరీస్‌ల్లో మాత్రం ఇరు జట్ల మధ్య పోరాటం నువ్వా నేనా అన్నట్లుగా ఉంది. గతంలో మూడు మ్యాచ్‌ల సిరీస్ మాత్రమే ఎక్కువగా జరిగేది. ఇప్పుడు సిరీస్‌లో ఐదు టెస్టులు జరగనుండటం అనందంగా ఉంది. బాక్సింగ్ డే టెస్టు (డిసెంబర్ 26) మ్యాచ్ కోసం కనీసం లక్ష మంది వస్తారని అనుకుంటున్నా. ఇలా కూడా ఆస్ట్రేలియా పర్యటక రంగం బాగుంటుంది' అని ఆల్బనీస్ తెలిపారు



ఇండియా వర్సెస్ పీఎం లెవన్ మ్యాచ్ తొలి రోజు ఆట రద్దు

భారత్, ఆస్ట్రేలియా ప్రైమ్‌మినిస్టర్స్ లెవన్ మధ్య జరగాల్సిన ప్రాక్టీస్ మ్యాచ్ శనివారం వర్షం వల్ల రద్దు అయ్యింది. ఆదివారం రెండు జట్ల మధ్య 50 ఓవర్ల మ్యాచ్ జరగనున్నది. రెండో టెస్టుకు ముందు ఈ ప్రాక్టీస్ మ్యాచ్ కీలకం కానున్నది. రెండు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ కాన్‌బెరాలోని మనూకా ఓవల్‌లో ప్రారంభం కావాల్సి ఉన్నది. కానీ ఎడతెరపిలేకుండా వర్షం పడుతున్న కారణంగా.. తొలి రోజు ఆటను రద్దు చేశారు. దీంతో భారత క్రికెటర్లకు.. పింక్ బాల్ ప్రాక్టీస్ మ్యాచ్ మిస్సయ్యే అవకాశాలు ఉన్నాయి. అడిలైడ్‌లో ప్రారంభం అయ్యే రెండో టెస్టుకు ముందు పింక్ బాల్ మ్యాచ్‌తో భారత్ సంసిద్ధం కావాలనుకున్నది. అయితే ఆదివారం 50 ఓవర్ల మ్యాచ్ ఆడేందుకు రెండు జట్లు అంగీకరించాయి.

రెండో టెస్టుకు హేజిల్‌వుడ్ దూరం

బలగం టీవి, అడిలైడ్

ఆస్ట్రేలియాకు షాక్ తగిలింది. అడిలైడ్‌లో భారత్‌తో జరిగే రెండో టెస్టుకు పేస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ గాయం కారణంగా దూరం కానున్నాడు. అయితే సిరీస్‌లో మిగితా మ్యాచ్‌ల నిమిత్తం జరిగే ప్రిపరేషన్ కోసం హేజిల్‌వుడ్ అడిలైడ్‌లోనే ఉండనున్నారు. రెండో టెస్టు కోసం ఆస్ట్రేలియా తమ జట్టులో సీన్ అబ్బాట్, బ్రెండన్ డగ్గెట్‌లను చేర్చినట్లు బోర్డు తెలిపింది. వీరితో పాటు బూ వెబ్‌స్టర్ కూడా జట్టులో కొత్తగా చేరనున్నాడు. అయితే హేజిల్‌వుడ్ స్థానంలో స్కాట్ బోలాండ్‌ను తుది జట్టుకు తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

హేజిల్‌వుడ్ రికవరీ అయ్యే వరకు అతడిని వైద్య బృందం పర్యవేక్షిస్తుందని క్రికెట్ ఆస్ట్రేలియా వెల్లడించింది."నడుము కింది భాగంలో నొప్పి వచ్చినట్లు టీమ్ మేనేజ్‌మెంట్ దృష్టికి హేజిల్‌వుడ్ తీసుకొచ్చాడు. అతడిని పరీక్షించిన డాక్టర్స్ రెస్ట్ అవసరమని సూచించారు" అని క్రికెట్ ఆస్ట్రేలియా పేర్కొంది. కాగా అతను పెర్త్ టెస్టులో ఐదు వికెట్లు తీసి అద్భుత ప్రదర్శన చేశాడు. అడిలైడ్ వేదికగా పింక్‌బాల్ (డే/నైట్) టెస్టు డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది.

రామ్ చరణ్ సినిమాలో 'మున్నా భయ్యా'

బలగం టీవి, హైదరాబాద్



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ కథానాయకుడిగా ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. 'ఆర్‌సీ16' వర్కింగ్ టైటిల్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌ను మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ కలసి ఈ ప్రాజెక్టును నిర్మించనున్నాయి. ఇప్పటికే పూజ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం కర్ణాటకలో షూటింగ్ ప్రారంభించినట్టు తెలిసింది. అయితే ఈ సినిమాలో మీర్జాపూర్ వెబ్ సిరీస్ నటుడు దివ్యేండు శర్మ కీలక పాత్రల్లో నటించబోతున్నారు. ఈ మేరకు దర్శకుడు బుచ్చిబాబు సనా 'ఆర్‌సీ16'లో మున్నా భయ్యా నటించబోతున్నాడు అంటూ ప్రకటించాడు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో మున్నా భయ్య పాత్రల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు దివ్యేండు. మరోవైపు ఈ సినిమాలో చరణ్‌కు జోడీగా జాన్వీకపూర్ నటించనుండగా.. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

'పుష్ప 2' టికెట్ రేట్లు పెంపు

బలగం టీవి, హైదరాబాద్

ఐకాన్ స్టార్ అల్లుఅర్జున్ 'పుష్ప 2' సినిమా డిసెంబర్ 5న విడుదల కానున్న సంగతి తెలిసిందే. సుకుమార్ తెరకెక్కించిన ఈ భారీ బడ్జెట్ చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. అయితే తాజా ఈ సినిమా టికెట్ ధరలు పెంపునకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలాగే రెండు బెనిఫిట్ షో లకు ప్రభుత్వం అనుమతించింది. డిసెంబర్ 4న రాత్రి 9.30 గంటలకు తొలి బెనిఫిట్ షోతో పాటు, అర్ధరాత్రి 1 గంటలకు రెండో షో పడనుంది. అయితే ఈ బెనిఫిట్ షోల టికెట్ ధరను రూ.800 పెంచుకునేందుకు ప్రభుత్వం వీలుకల్పించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా సింగిల్ స్క్రీన్, మల్టీప్లెక్స్ ఏదైనా సరే ఇప్పుడున్న ధరకు అదనంగా రూ.800 చెల్లించాల్సిందే. అంటే బెనిఫిట్ షోకు టికెట్ ధర సింగిల్ స్క్రీన్స్‌లో సుమారు రూ. 1000, మల్టీప్లెక్స్‌లలో రూ.1200 పైగా అవుతోంది.

ఇక డిసెంబర్ 5 నుంచి 8 వరకు సింగిల్ స్క్రీన్‌లలో రూ.150, మల్టీప్లెక్స్‌లో రూ.200 పెంచారు. డిసెంబర్ 9 నుంచి 16 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.105, మల్టీప్లెక్స్‌లో రూ.150 పెంపునకు అనుమతి ఇచ్చారు. ఇక డిసెంబర్ 17 నుంచి 23 వరకు సింగిల్ స్క్రీన్‌లో రూ.20, మల్టీప్లెక్స్‌లో రూ.50 పెంపునకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇదిలా ఉండగా తెలంగాణలో ప్రీ బుకింగ్స్ శనివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. చిత్రంలో రష్మిక మందనా హీరోయిన్‌గా నటించింది. డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల స్పెషల్ సాంగ్‌లో ఆడిపాడింది. సీనియర్ నటులు ఫాహద్ ఫాజిల్, జగపతి బాబు, అనసూయ, సునీల్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. రాక్?స్టార్ దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందిచగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ సంయుక్తంగా నిర్మించారు.

అవకాశాలు రాక ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా

- సీనియర్ సినీ నటుడు రాజేంద్రప్రసాద్

బలగం టీవి, హైదరాబాద్

తన కెరీర్ తొలినాళ్లలో ఎన్నో కష్టాలను అనుభవించానని సీనియర్ సినీ నటుడు రాజేంద్రప్రసాద్ చెప్పారు. చేతిలో డబ్బులేక దాదాపు మూడు నెలలు అన్నం కూడా తినలేదని.. సినిమాల్లో అవకాశాలు రాకపోవడంతో ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని తెలిపారు. తాజాగా ఓ యూట్యూబ్ ఛానల్‌తో ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్తి చేసిన వెంటనే సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. స్కూల్ టీచర్ అయిన తన తండ్రి ఎంతో స్ట్రిక్ట్ గా ఉండేవారని... తాను సినిమాల్లోకి వెళ్లాలనుకుంటున్నానని చెపితే అసహనం వ్యక్తం చేశారని చెప్పారు. నీ ఇష్టానికి వెళుతున్నావు... సినిమాల్లో ఫెయిల్ అయితే ఇంటికి రావద్దని అన్నారని తెలిపారు. ఆయన మాటలు తనపై ఎంతో ప్రభావం చూపాయన్నారు. ఆ తర్వాత తాను మద్రాస్ వచ్చి ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లో చేరానని... గోల్డ్ మెడల్ సాధించానని తెలిపారు. అయితే సినిమా అవకాశాలు మాత్రం రాలేదన్నారు. ఇంటికి తిరిగి వెళ్తే... రావద్దన్నాను కదా ఎందుకు వచ్చావని నాన్న అన్నారని... ఎంతో బాధతో వెంటనే మద్రాస్‌కు వచ్చానని తెలిపారు.

ఒకరోజు నిర్మాత పుండరీకాక్షయ్య ఆఫీసుకు వెళ్తే... అక్కడ ఏదో గొడవ జరుగుతోందని... తన రూమ్ నుంచి బయటకు వచ్చిన ఆయన తనను డబ్బింగ్ థియేటర్ కు తీసుకెళ్లారని... ఒక సీన్‌కు తనతో డబ్బింగ్ చెప్పించారన్నారు. అది ఆయనకు బాగా నచ్చడంతో రెండో సీన్ కు డబ్బింగ్ చెప్పించారని తెలిపారు. భోజనం చేసి మూడు నెలలు అయింది. భోజనం పెడితే డబ్బింగ్ చెబుతా అని అన్నానని.. అవకాశాల్లేక ఆత్మహత్య చేసుకోవాలనిపించింది అని చెప్పానన్నారు. దీంతో ఆయన కోప్పడి, ఇంటికి తీసుకెళ్లి మంచి భోజనం పెట్టారని తెలిపారు. అలాగే తనకు ధైర్యం చెప్పారన్నారు. అలా తన డబ్బింగ్ ప్రయాణం మొదలయిందని... మద్రాస్‌లో ఇల్లు కట్టుకున్నానని చెప్పారు. ఆ తర్వాత దర్శకుడు వంశీతో పరిచయం కావడం... ఆయన సినిమాలలో హీరోగా గుర్తింపు తెచ్చుకున్నానని అన్నారు.

కొత్త ఎనీఆర్ సినిమాలో హీరోయిన్ పరిచయం..

బలగం టీవి, హైదరాబాద్

నందమూరి హరికృష్ణ మనవడు, జానకిరామ్ కుమారుడు నందమూరి తారకరామారావును వైవీఎస్ చౌదరి హీరోగా పరిచయం చేయబోతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ మూవీ నుంచి నందమూరి తారకరామారావు ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా ఇప్పుడు తాజాగా హీరోయిన్‌ను కూడా మేకర్స్ పరిచయం చేశారు. తెలుగమ్మాయి వీణ రావు నటించబోతుంది అంటూ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. వైవీఎస్ మాట్లాడుతూ.. కొత్తవారిని పరిచయం చేయడంలో ఈ వైవీస్ ఎప్పుడు ముందుంటాడు. తన కెరీర్‌లో ఎంతోమంది కొత్తవారిని ఇండస్ట్రీకి పరిచయం చేశాను. వీణ మరెన్నో సినిమాలు చేయాలని కోరుకుంటున్నా అని చెప్పారు.

హరిహర వీరమల్లు చివరి షెడ్యూల్..

- జాయిన్ అయిన పవన్ కల్యాణ్

బలగం టీవి, హైదరాబాద్



ఏపీ డిప్యూటీ సీఎం, నటుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న హరిహర వీరమల్లు చిత్రం చివరి షెడ్యూల్‌లో పవన్ కళ్యాణ్ జాయిన్ అయినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ధర్మం కోసం పోరాటంలో ఆఖరి అధ్యాయం మొదలు అంటూ పవన్ నిలుచున్న ఫొటోను పంచుకుంది. ఈ మూవీని 2025 మార్చి 28న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. జ్యోతి కృష్ణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. నిధి అగర్వాల్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఎంఎం కీరవాణి ఈ